ప్రమాదకరంగా మూలమలుపు

● స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్

కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి తన తల్లికి టిఫిన్ తేవడానికి హోటల్‌కు వెళ్తుండగా మూలమలుపు వద్దకు రాగానే దేవేందర్‌నగర్ నుంచి గాజులరామారం వైపు వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో అతడు 100 మీటర్ల దూరంలో ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందాడు.



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

గాజులరామారం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గాజులరామారం గ్రామం నుంచి దేవేందర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. దీనికి తోడు వాహనాలు వేగంగా దూసుకొస్తుండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని, దీంతో ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అయితే నిత్యం వందల వాహనదారులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని వాహనదారులు కోరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలింగా ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, దీనికి తోడు ఈ మూలమలుపు నుంచే గాజులరామారం ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగిస్తుంటారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని పలు బస్తీవాసులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి



గాజులరామారం నుంచి దేవేందర్‌నగర్‌కు వచ్చే ప్రధాన రోడ్డులో ఉన్న మూలమలుపు వద్ద అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేస్తే ప్రమాదాలు జరుగకుండా ఉంటాయి.

- మల్లేష్, బతుకమ్మబండ



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

హైదర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ జైభారత్‌నగర్‌లో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. సీసీరోడ్డు పనులు త్వరగా ప్రారంభించి నాణ్యత ప్రమాణాలతో గడువులోపు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, కుమారస్వామి, మహేష్, సురేష్, కృష్ణంరాజు, శివరాం ప్రసాద్, వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, సాంబశివరావు, నరేష్ పాల్గొన్నారు.

● ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషిగూడ పరిధిలోని ఇంద్రహిల్స్‌లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో వెంకట్‌నాయక్, పోశెట్టిగౌడ్, రాజుగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి న్యూ కోర్టులో నేటి నుంచి కార్యకలాపాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి న్యూ కోర్టులో సోమవారం నుంచి కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి. కైత్లాపూర్ సమీపంలో రూ.43 కోట్ల వ్యయంతో నిర్మించిన కోర్టు సముదాయాన్ని ఈనెల 15న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాదే ప్రారంభించిన విషయం తెలిసిందే.. ప్రశాంత్‌నగర్‌లోని అద్దె భవనంలో సాగుతున్న కోర్టు సామగ్రిని ఇక్కడకు తరలించారు. నేడు ఉదయం 10.30 గంటల నుంచి పూర్తి స్థాయిలో కోర్టు కార్యకలాపాలు ఇక్కడి నుంచే జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లను పూర్తి చేశారు.

కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బదిలీ

కుత్బుల్లాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎన్.సాయిబాబా బదిలీ అయ్యారు. ఆయనను శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బదిలీ చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయనను ఉప కమిషనర్ నర్సింహ రిలీవ్ చేశారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయిన అధికారులు, సిబ్బందిని త్వరలోనే బదిలీ చేయనున్నట్టు తెలుస్తోంది.



నూతన సభ్యులతో చైర్మన్‌గా ఎన్నికైన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

మదర్‌థెరిసా రెసిడెన్షియల్ నూతన కమిటీ ఎన్నిక

నిజాంపేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పలోని మదర్ థెరిసా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. జనరల్ బాడీ సమావేశంలో ఈ నూతన కమిటీ చైర్మన్‌గా కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పితాని శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా మానేపల్లి నర్సింగరావు, ఉపాధ్యక్షుడిగా పోచారం ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా దాలి నాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా శ్రీనివాసరావులతో పాటు మరో ఆరుగురు కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మదర్‌థెరిసా ఆశయాలకు అనుగుణంగా కాలనీని అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు.



విద్యార్థులతో సంఘం ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

హైదర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట శాఖ ఆధ్వర్యంలో 32 మంది నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులకు రూ.6 లక్షల ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులో సంఘ కార్యాలయంలో పలువురు దాతల సహకారం అందించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో విశేష సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయసారధి, సుధాకర్, పారానంది శంకర్, భువనేశ్వరి, రమణి, లక్ష్మీనారాయణ, రాజయ్య, రామారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



భరత్‌కుమార్

గాజులరామారం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూరారం సీఐ భరత్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గల్లీలు, కూడల్లో పోలీసుల నిఘా ఉంటుందని, ఎవరైన అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానితులు గానీ, అవాంచనీయ సంఘటనలు గానీ జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 20 మంది దరఖాస్తు చేసుకోగా వారికి రూ.8.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం లబ్ధిదారుల కుటుంబసభ్యులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షిపాతి అన్నారు.

పాడైన పచ్చళ్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

● 500 కిలోల పచ్చళ్లు స్వాధీనం

జీడిమెట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పచ్చళ్లు తయారు చేస్తూ, కుళ్లిపోయి పాడైపోయిన పచ్చళ్లను విక్రయిస్తున్న స్థావరంపై బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేశారు. దాదాపు 5 వందల కిలోల పాడైపోయిన పచ్చళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నిందితులపై కేసునమోదు చేయనున్నారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్‌కు చెందిన పిల్ల శ్రీనివాస్(47) పచ్చళ్ల వ్యాపారం సాగిస్తున్నాడు. కుళ్లిపోయిన పచ్చళ్లను విక్రయిస్తున్నాడని తెలుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం దాడిచేసి తయారీదారులను అదుపులోకి తీసుకుని జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే కేసునమోదు చేస్తామని సిఐ గడ్డం మల్లేష్ తెలిపారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివేష్‌పాండే

జీడిమెట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని మేడ్చల్ ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌కు చెందిన వివేష్‌పాండే(32) బతుకు దెరువుకోసం నగరానికి వచ్చాడు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అధిక సంపాదన కోసం ప్రయాగ్‌రాజ్ నుంచి గంజాయి చాక్లెట్లు తెచ్చి విద్యార్థులకు, అలవాటు ఉన్నవారికి గంజాయి చాక్లెట్లు విక్రయించడం ప్రారంభించాడు. 6 నెలలుగా గంజాయ చాక్లెట్‌లు విక్రయిస్తున్న ఇతడి గురించి ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారమందింది. ఆదివారం ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులతో కలిసి దాడిచేసి 2 వందల గంజాయ చాక్లెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

శ్రావణమాస చిత్తారమ్మ బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లోని చిత్తారమ్మ దేవాలయం శ్రావణమాసం బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కైత్లాపూర్, రాఘవేంద్ర కాలనీ నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు.

పబ్‌లో యువతులపై దాడి

రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్ఎన్ పబ్‌లో ఇద్దరు అమ్మాయిలతోపాటు ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడి దాడి చేశారు. కొండాపూర్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్‌తివారి శనివారం రాత్రి 11.30 గంటలకు ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి కొండాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ పబ్‌కు వచ్చాడు. తిరిగి 12.30 గంటలకు ఇంటికి వెళ్లేందుకు కారువద్దకు వచ్చారు. పక్కనున్న నలుగురు యువకులు అమ్మాయిల పట్ల అసభ్యంగా కామెంట్లు చేశారు. ఎందుకు కామెంట్ చేస్తున్నారని తివారి అడుగగా బూతులు తిడుతూ అతడిపై దాడి చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన అమ్మాయిలపైనా దాడిచేసి పరారయ్యారు. దీంతో తివారి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



చెరువు వద్ద చేరిన పక్షులు

శ్రీరామకుంట చెరువు వద్ద పక్షుల సందడి

నిజాంపేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీరామకుంటను ఇటీవల కాలంలో కార్పొరేషన్ అధికారులు సుందరీకరణ చేశారు. చెరువు చుట్టూ కాలనీవాసులకు వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్ వంటి సదుపాయాలు కల్పించారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు చెరువు పూర్తిగా నిండింది. వివిధ ప్రాంతాల నుంచి అక్కడికి చేరిన పక్షులు కోలాహలం చేస్తూ చూపర్లను ఆకట్టుకుంటున్నాయి.



వృద్ధుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్

హైదరాబాద్ సిటీ: వృద్ధుల సంక్షేమ కోసం, వారి సమస్యల పరిష్కారానికి రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడానికి సీపీ సుధీర్ బాబు కరసత్తు చేస్తున్నారు. ఈ హెల్ప్‌డెస్క్ అతిత్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది.

ఇటీవల ఎంతో మంది వృద్ధులు నేరస్థుల బారిన పడి మోసపోతున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి, ఇన్వెస్టిమెంట్, ఇన్సూరెన్స్, కేవైసీ అప్‌డేట్ వంటి తదితర సైబర్ నేరాల భారినపడి రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. అలాంటి సైబర్ నేరాల పట్ల వృద్ధులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.? గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌లు వస్తే ఎలా అప్రమత్తం కావాలి..? వెంటనే హెల్ప్‌డెస్క్‌ను ఎలా సంప్రదించాలి..? అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. అందుకోసం సీపీ ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే వెళ్లి తమ బాధను చెప్పుకొని పరిష్కరించుకోవడానికి సరైన వేదికలేక అనేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు పోలీసులు అండగా నిలిచి అక్కున చేర్చుకోవాలని సీపీ సంకల్పించారు. నగరంలోని చాలా ఇళ్లలో పిల్లలు ఉన్నత ఉద్యోగాలతో విదేశాల్లో స్థిరపడ్డారు. దీంతో ఇళ్లలో వృద్ధులు మాత్రమే ఒంటరిగా కాలం వెళ్లదీస్తున్నారు. వారిని పలకరించి, మేమున్నామనే భరోసా కల్పించే విధంగా హెల్ప్‌డెస్క్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిసింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో హెల్ప్‌డెస్క్‌లను ఎలా అందుబాటులోకి తేవాలి..? వృద్ధులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఏ నంబర్‌లో? పోలీసులను ఎలా సంప్రదించాలి..? అనే అంశాలపై సీపీ ప్రత్యేక కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతానికి గురై కూలీకి తీవ్రగాయాలు

జీడిమెట్ల: విద్యుదాఘాతానికి గురై ఓ కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం నెహ్రూహరానగర్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. నెహ్రూనగర్‌లో వీరన్న అనే వ్యక్తి హైటెన్షన్ వైర్లకింద అనుమతి లేకుండా రెండంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రమేష్(35) అనే కూలీ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై భవనం పైనుంచి కిందపడ్డాడు. గాయపడిన రమేష్‌ను ఆసుపత్రికి తరలించారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కావడంతో చుట్టపక్కల ఇళ్లల్లో మీటర్లు, విలువైన వస్తువులు కాలిపోయాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేస్త్రీ కార్మిక సంఘం అధ్యక్షుడి మృతి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం మేస్త్రీ కార్మిక సంఘం అధ్యక్షుడు, గంగపుత్ర కాలనీ ఉపాధ్యక్షుడు పూస నర్సింహ (66) ఆదివారం గంగపుత్ర కాలనీలోని తన నివాసంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు పూస గోరక్‌నాథ్, రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నాగేందర్, నాయకులు మల్లేష్, జగదీష్ తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర: కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మూడవ నంబర్ ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకటేశ్వర్లు

మియాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే చిన్న వెంకటేశ్వర్లు(55) బయటకువెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నా.. రోడ్లకు మరమ్మతులు చేయండి

● రోడ్ల విస్తరణ చేయాలి.. నిధులు కేటాయించండి ● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలోని రోడ్లను విస్తరించడంతో పాటు, మరమ్మతులకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో భారీ పరిశ్రమలు ఉండడంతో పాటు పలు రోడ్లు ఓఆర్ఆర్‌కు వెళ్తున్నాయని, దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోందన్నారు. రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, దీని కారణంగా వివిధ కాలనీల ప్రజలు, ఆ ప్రాంతంలో ఉన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో చదివే విద్యార్థులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహిపాల్ ప్రతిపాదించిన రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు, విస్తరణ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకువెళ్తుందని ఎమ్మెల్యేకు చెప్పారని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

- పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడం. ఇందుకు రూ.70 కోట్లు కేటాయించాలి.
- కిష్టారెడ్డిపేట నుంచి దౌల్తాబాద్ వయా రామేశ్వరబండ వరకు రోడ్డును రెండు లేన్లుగా విస్తరించాలి. ఇందుకోసం రూ.5 కోట్లు.
- పటాన్‌చెరు- మల్కాపూర్ రోడ్డు మరమ్మతులకు రూ.5.25 కోట్లు.
- బీహెచ్‌ఈఎల్ మెయిన్‌గేటు నుంచి ఎన్.హెచ్-9 వయా వెల్మలా రోడ్డు మరమ్మతులకు రూ.2.1 కోట్లు
- గుమ్మడిదల నుంచి నూతనకల్ వయా కనుకుంట రోడ్డు విస్తరణకు రూ.6.82 కోట్లు
- శివనగర్ నుంచి కంజెర్ల రోడ్డు విస్తరణకు రూ.2కోట్లు మంజూరు చేయాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్, గౌడసంఘం నేతలు

మియాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా మియాపూర్ ఆల్విన్‌కాలనీ క్రాస్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతి లక్ష్మీనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి వినయ్‌కుమార్‌గౌడ్, స్టీరింగ్ కమిటీ సభ్యులు మోహన్‌గౌడ్, యూత్‌కమిటీ అధ్యక్షుడు బాలింగ్ గౌతంగౌడ్, నాయకులు కరుణాకర్ గౌడ్, ఓం ప్రకాష్‌గౌడ్, నాగేశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

● **హైదర్‌నగర్:** కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాందాస్‌గౌడ్, పోశెట్టిగౌడ్ పాల్గొన్నారు.

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కేపీహెచ్‌బీకాలనీ:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని ఆదివార మూసాపేట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **గాజులరామారం:** సర్వాయిపాపన్న జయంతి సందర్భంగా గాజులరామారం చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కెకెఎం ట్రస్ట్ ఛైర్మన్ కూన శ్రీశివాస్‌గౌడ్, బండి శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మధు, రవిగౌడ్, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి, పోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్న శంభీపూర్ కృష్ణ తదితరులు

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

దుండిగల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామంలో జరుగుతున్న శ్రావణ మాస బోనాల వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ కృష్ణ పాల్గొని రాజరాజేశ్వరి, పోచమ్మ అమ్మవార్లను ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

● ఇందిరానగర్‌లో..

నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి ప్రాంతంలోని ఇందిరానగర్‌లో జరుగుతున్న బోనాల వేడుకలకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ బాలజీ నాయక్‌తో పాటు ఇందిరానగర్ వాసులు ఉన్నారు.